కథ



# ఒంటరి అంకె

- గౌతమ్

**రాత్రి పదకొండు గంటలు దాటాక ఇల్లు చేరాడు అశోక్‌రావు. స్కూటర్‌ని వరండాలోకి తెచ్చి స్టాండ్ వేస్తుండగా - వరండాలో లైటు వెలగటం, వాకిలి తలుపు తెరుచుకుని అతని శ్రీమతి సంధ్య వెలుపలికి రావటం, దాదాపుగా రెండూ ఒకేసారి జరిగాయి.**

ఆరోజు సాయంత్రం ఆరింటికే వస్తానని చెప్పి వెళ్ళిన భర్త ఇంటికి ఇంత ఆలస్యంగా రావటంలో గల ఆంతర్యం - తోటకూర కాడలా వాడి వ్రేలాడుతున్నట్లున్న అతని వాలకం చూసే తెలుసుకుంది. ఆ వేళ ఆఫీసులో పని బాగా వుండి వుండొచ్చని ... అందుచేతనే ఆలస్యం గురించిన ప్రస్తావన తేలేదు.

ఈలోగా ''ఏమిటి సంధ్యా ఇంకా నిద్రపోలేదు? విశేషమేమైనా!'' ... లోపలికి దారితీస్తూ అడిగాడు భార్యని అశోకరావు.

''ఆ ఆ! లేకే... లోపలికి రండి మీకే తెలుస్తుంది...'' సంధ్య చాలా సాధారణంగా అన్నప్పటికీ అలా అనటంలో ఏదో వ్యంగ్యత గోచరించింది అతనికి.

ముడిపడ్డ భృకుటితో ఓసారి భార్య ముఖంలోకి చూశాడు పరిశీలనగా ...

''మీ వర్ధని పిన్నిగారు, ఆవిడ కొడుకు శంకరం, ఆయన భార్యాపిల్లలు ... మొత్తం ఓ అరడజను మంది దాకా వచ్చారు. యాత్రలకెళ్ళి వస్తున్నారట ... దారిలో మీరు గుర్తొచ్చి ఓ వారం రోజులు విడిది చేద్దామని ఆగారట'' అంది.

అదిరిపడ్డాడు అశోక్‌రావు. ''అరడజను మందే? అసలే నెలాఖరు రోజులు ... పిలవని పేరంటాళ్ళలా ఏమిటీ రావటం? మనం ఎప్పుడు వెళ్ళిందీ పెట్టిందీ లేకపోయినా'' ... చిరాకు పడుతూ అన్నాడు.

''పెద్దగా అనకండీ! ... వాళ్ళంతా తిని ఇంతక్రితమే పడకలెక్కారు ... మీ మాటలు వినిపిస్తాయి!'' చెవి దగ్గరగా వచ్చి చెప్పింది సంధ్య.

అవతల ఆఫీసులో పెండింగ్ ఫైళ్ళ పరిష్కార వ్యవహారం ముగిసేసరికి తలబొప్పికట్టింది ... ఇంటికి రావటంతోనే ఆశనిపాతంలా ఈ షాక్ న్యూసొకటి ...

వారం రోజులు ... అరడజను మందిని భరించటమంటే మాటలా! ... బడ్జెట్ తారుమారు అవుతుంది ... మరింత డీలా పడిపోతూ లోపలికి నడిచాడు అశోక్‌రావు.

స్నానం చేస్తున్నంత సేపూ భోజనం ముగిసేంతవరకూ అతను ఆ అనుకోని బంధువుల ఆగమనం తెచ్చిన ఇబ్బంది గురించే ఆలోచిస్తున్నాడు.

పరిస్థితుల ప్రభావమో - మరి కాలానుగుణమైన మార్పో అది తెలియదు కానీ అశోక్‌రావు తన వైవాహిక జీవితం ప్రారంభించినప్పటి నుంచీ గిరిగీసుకుని బ్రతకటం అలవర్చుకుంటున్నాడు. స్నేహితులకు, బంధువులకూ దూరమైపోతున్నాడు. తాను ఇతరుల ఇళ్ళకు వెళ్ళటం కానీ, ఇతరులు తన ఇంటికి రావటం కానీ ఇష్టపడడు.

అదంతా ఓ నాన్‌సెన్స్ అని ... తలనొప్పి వ్యవహారం అనేది అతని అభిమతం.

కానీ మనం సంఘ జీవులం - మానవ సంబంధాల కొనసాగింపులో, రాకపోకలు, సహాయ సహకారాలూ అనివార్యమనే విషయం అతను గమనించటం లేదు. ఒంటిచేత్తో ముడివేసుకోవటం తేలిక కాదు కదా! -

అయితే అతను అనుసరిస్తున్న పద్ధతి కానీ, అతని ఆలోచనా విధానంలో లోపముందని కానీ అతని శ్రీమతి సంధ్య ఏనాడూ హితవు చేసింది కాదు. భర్తకు నచ్చని విషయాల జోలికి తాను వెళ్ళటం - అవివేకమనే ధోరణిని అలవర్చుకుని అతని అడుగుజాడల్లో నడవటానికి అలవాటుపడ్డ సగటు గృహిణి ఆమె.

నిద్రరాక మంచం మీద అటూ, ఇటూ దొర్లుతున్న భర్త





నుద్దేశించి - ''మీరేం వర్రీ అవకండీ ... రెండు రోజుల్లో వాళ్ళు ఇక్కడ్నుంచి పలాయనం చేసేటట్టు నేను చూస్తాను కదా! ... మా బామ్మ చెబుతుండేది ... కొట్టొద్దు తిట్టొద్దు ఆ చేసేదేదో గుట్టు చప్పుడు కాకుండా చేస్తే రోగం కుదురుతుందీ అనీ ... ఆ మంత్రం నాకు తెలుసు... మీరు నిశ్చింతగా పడుకోండి'' అంది సంధ్య.

అప్పటికిగానీ అశోక్‌రావుకు స్థిమితం ఏర్పడలేదేమో... తన బుద్ధినెరిగి మసలుతున్న తన సహధర్మచారిణి వైపు మెచ్చుకోలుగా చూస్తూ నిద్రకు ఉపక్రమించాడు.

☆☆☆

**ఉ**దయాన్నే వచ్చి నిద్ర లేపింది వర్ధనమ్మ అశోక్‌రావుని. ''ఏరా అబ్బాయీ.. రాత్రి బాగా పొద్దుపోయి వచ్చినట్టున్నావ్?'' అని అడిగింది లేపుతూనే.

''ఔను పిన్నీ... నిన్న ఆఫీసులో పనికొంచెం ఎక్కువగా వుండి ఆలస్యంగా వచ్చాను. ఇంటికి రాగానే చెప్పింది సంధ్య మీ గురించి... యాత్రలకెళ్ళి వస్తున్నారట కదా ... అంతా ప్రయాణాలు చేసి అలసిపోయి ఉంటారు. ఆవేళప్పుడు నిద్ర చెడగొట్టటం ఎందుకని నేనే లేపలేదు .. ఆ ఏమిటి పిన్నీ మన ఊరి సంగతులు? అంతా బావున్నారా? పంటలు ఎలా వున్నాయి ఈ సంవత్సరం. మన శంకరుగాడేదో వ్యాపారంలో దిగాడని విన్నాను'' కుశలప్రశ్నలు మొదలుపెట్టాడు అశోక్‌రావు.

''ఆ ... ఆ! దిగాడు ... మొదట్లో లోటుపాట్లు తెలియక వ్యాపారంలో నష్టాలు చూశాడు ... తర్వాతర్వాత లైన్లో పెట్టాడులే



... వాళ్ళ నాన్న బ్రతికున్న రోజుల్లో చేసిన తలకు మించిన అప్పులన్నీ వీడేగా తీర్చింది మరి...'' చెప్పుకుపోతోంది వర్ధనమ్మ.


''ఆహా పర్వాలేదైతే ...'' అన్నాడు అశోక్‌రావు.

''అరేయ్ అబ్బాయ్ అశోకూ ... ఏమంటూ ఉద్యోగరీత్యా మన ప్రాంతం వదిలి ఇటు వచ్చేశావో కానీ మమ్మల్ని, మన ఊరి వాళ్ళనందర్నీ మరిచిపోయావు కదరా బాబు ... ఇదేం బాగా లేదు రా!'' నిష్ఠూరం ధ్వనించింది వర్ధనమ్మ మాటల్లో.

''లేదు పిన్నీ ఎలా మర్చిపోతాను'' రావాలని వుంటుంది కానీ కుదిరిచావటం లేదు.

''ఊరికే అలా మాట అడ్డం వేశాడే తప్ప వెళ్ళేందుకు ఎప్పుడూ పెద్దగా ప్రయత్నించలేదు అశోక్. పుట్టిన గడ్డని, అయిన వాళ్ళని

## ఎంజాయ్ చేసిన చిత్రం



నేను పూర్తిగా ఎంజాయ్ చేస్తూ నటించిన చిత్రం 'మనోహరం'. అతి తక్కువ చిత్రాలు ఇలా ఎంజాయ్ చేయగలం అంటున్నాడు జగపతిబాబు. మరి భవిష్యత్ గూర్చి అడిగితేనేమో, 'మామూలు చిత్రాలు చేసి విసుగొచ్చేసింది. విభిన్న తరహా పాత్రలు దొరికితేనే చేస్తా' అని సమాధానం ఇచ్చాడు.

చాలా తేలికగానే మరచిపోయాడని చెప్పక తప్పదు. తల్లీతండ్రీ బ్రతికున్న రోజుల్లోనే తప్పనిసరైతేనే వెళ్తుండే వాడు - ఒకసారి మనం వాళ్ళ ఇళ్ళకు వెళ్తే, పదిసార్లు వాళ్ళొచ్చి మెక్కిపోతారనే అభిప్రాయం అతనిది.

ఇంతలో అక్కడికి శంకరం - అతని భార్య నీరజ వచ్చారు.

''ఏం అన్నయ్యా నువ్వేదో సుఖంగా పెద్ద ఉద్యోగం వెలగబెడ్తున్నావనుకున్నాను. ఇదేం ఉద్యోగంరా బాబు అర్ధరాత్రుళ్ళు ఇంటికొస్తున్నావ్!'' అశోక్‌రావు బెడ్‌మీద తనూ కూర్చుంటూ అన్నాడు శంకరం.

''ఉద్యోగస్తుల సాధక బాధకాలు మీ వ్యాపారస్తులకేం తెలుస్తాయండి మరి!'' నీరజ - అశోక్‌రావుకి వకాల్తా రావటంతో అంతా నవ్వారు.

''అది సరే! అబ్బాయి అశోకూ ఈ వూళ్ళో గుళ్ళూ గోపురాలు చూడదగ్గ మంచి ప్రదేశాలూ ఏమైనా ఉన్నాయిరా?'' అడిగింది వర్ధనమ్మ.

ఉలిక్కిపడ్డాడు అశోక్‌రావు. వచ్చి తిష్టవేసింది చాలక ఇదొహటా! 'ఇక అయినట్లే! గుళ్ళూ గోపురాలు తిప్పి చూపించటం తన వల్లేం అవుతుంది? పైగా ఆ ఖర్చంతా తన నెత్తిన పడదూ?' ... అందుకే మరేం ఆలోచించకుండా నోటికొచ్చిన అబద్ధం ఆడేశాడు - ''ఈ ఊళ్ళో చూడదగ్గ ప్రదేశాలు ఏమున్నాయి పిన్నీ! ... ఇదో అనాకారి ఊరయితే ..'' అంటూ.

''అదేంటి డాడీ! మన ఊళ్ళో భావనారాయణస్వామి గుడి వుంది కదా డాడీ! మరేమో సముద్రం వుంది..'' అక్కడే వున్న అశోక్‌రావు కొడుకు రాహుల్ ఓ పెద్ద రహస్యాన్ని ఛేదించి చెబుతున్న వాడిలా పోజ్ పెట్టి చెప్పాడు.

అశోక్‌రావు గుండె జారిపోయింది. ఇంకేమేమి ఇన్‌ఫర్‌మేషన్ ఇస్తాడో ఏమోనని గాబరాపడిపోయి చూశాడు రాహుల్‌కేసి.

''నువ్విక్కడ్నుంచి వెళ్ళరా!'' అని కొడుక్కు అర్థమయ్యేలా చెప్పటానికి అశోక్‌రావు చేసిన అలవాటు లేని మైకు యాక్షన్ రక్తి కట్టలేదు. రాహుల్‌కేమీ బోధపడకపోగా - ''డాడీ ఉదయం వెళ్ళి రాత్రికి వస్తారు కదా ఆఫీసు నుంచీ ... ఆయనకేం తెలియదు ఈ ఊరి విషయాల గురించి'' అన్నాడు.

వర్ధనమ్మ, నీరజ, శంకరం, అప్పుడే అక్కడికి వచ్చిన సంధ్య - అంతా గొల్లున నవ్వారు. తమా వాళ్ళతో శృతి కలపక తప్పలేదు అశోక్‌రావుకు.

దాంతో మరింత ఇన్‌స్పైర్ అయిన రాహుల్, ఆ ఊళ్ళో - ఆ ఊరి పరిసరాలలో వున్న గుళ్ళూ, గోపురాలు, తదితర చూడదగ్గ ప్రదేశాల గురించి గుక్క తిప్పుకోకుండా చెప్పాడు.

అంతా విన్న వర్ధనమ్మ - ''ఎంతగా ఈ ఊరంటే ఇష్టం లేకపోయినా మరీ అలా తీసేసి మాట్లాడితే ఎలారా అశోకూ?'' అంది లౌకికంగా.

''పసి వెధవ వాడికేం తెలుసు పిన్నీ!'' అంటూ అశోక్‌రావు తేల్గ్గా కొట్టిపారేసినా వర్ధనమ్మ పట్టుదల ముందర అదేం కుదరలేదు.

ఎంత తప్పించుకుందామని చూసినా తప్పలేదు అశోక్‌రావుకు. ఆఫీసుకు ఓ మూడు రోజులు శెలవు పెట్టాల్సి వచ్చింది.

వాళ్ళో అరడజను మంది, తన కుటుంబ సభ్యులు నల్గురు కలిసి వెరసి పది మందిని వెంటేసుకుని, బీచ్‌కు గుళ్ళూ - గోపురాలకు, కొండలకు - కోనలకు తిప్పేసరికి అశోక్‌రావు పని అయిపోయింది.

అక్కడికీ అతని శ్రీమతి - టిఫెన్లకు గాను తేలికపాటి ఉప్మా, పులిహోరల్లాంటి వంటలు, చిరుతిళ్ళకు పేలాలు పప్పు వుండలతో సరిపుచ్చింది.

తను తక్కువ తిన్నాడా!

ఆటోలు ఎక్కవలసి వచ్చినప్పుడు సిటీ బస్సుల్లోనూ, రిక్షాలు ఎక్కవలసి వచ్చినప్పుడు కాలినడకనా అందర్నీ తిప్పాడు. లేకపోతే చాలా ఖర్చయ్యేది.

అయినా, అయిన ఖర్చు ముందర అదుపు చేసింది తక్కువే. కాకపోతే ఒక్కరూపాయి బ్లేడుతో అరడజను సార్లు గడ్డం గీసుకునే నైజం కలవాడవటంతోనేమో కొంతలో కొంత రిలీఫ్ ఫీలయ్యాడు అశోక్‌రావు.

అయితే అది తాత్కాలికమే. అతను ఆలోచిస్తున్నది అదికాదు 'వీళ్ళు ఎప్పుడు వెళ్తారా?' అని.

మరో నాలుగు రోజుల తర్వాతగానీ అశోక్‌రావు ఊహించే శుభ ఘడియ రాలేదు.

''రేపు ఉదయం క్రిష్ణా ఎక్స్‌ప్రెస్‌కి వెళ్తాంరా అబ్బాయ్!'' అని వర్ధనమ్మ ప్రకటన విడుదల చేశాక కానీ అతని మనసు కుదుటపడ లేదు.

వర్ధనమ్మ మరో మాట కూడా అంది ''ఆఫీసుకు ఓ వారం రోజులు శెలవుపెట్టి నువ్వో, నీ భార్యతో కలిసి మన ఊరు వెళ్దాం రాకూడదూ!'' అంటూ.

''వారం రోజులే! ... అది అయ్యే పనికాదు పిన్నీ ... మొన్నటికి మొన్న మూడు రోజులు శెలవు ఇవ్వటానికే తెగ హైరానా పడి పోయాడు మా ఆఫీసర్... ఇప్పుడు కాదు తర్వాతెప్పుడైనా వస్తా ములే...'' తప్పించుకోచూశాడు అశోక్‌రావు.

''నువ్వు రాకపోతే రాకపోయావ్... వదిననూ, పిల్లల్నీ కనీసం మాతో పంపించు ... నాల్గు రోజులు వుండి వస్తారు...'' శంకరం అందుకున్నాడు.

''రేపట్నుంచీ నాకూ చెల్లాయికి శెలవులు కూడా వస్తున్నాయి డాడీ... మమ్మల్ని పంపించండి... అయినా మీరు పగలంతా ఆఫీసు లోనే ఉంటారు. రేపు శెలవుల్లో మాకేం తోస్తుందిక్కడ! ..'' రాహుల్‌గోముగా అన్నమాటలకు అంతా నవ్వారు.

''నీ కొడుకు కూడా మాతో రావటానికి ఇష్టపడుతున్నాడురా అశోకూ! వీళ్ళను మాతో పంపించక తప్పదు నువ్వు'' వర్ధనమ్మ రాహుల్ కనబరుస్తున్న ఆసక్తిని అవకాశంగా మార్చుకుంటూ అంది.

అయిష్టంగానే తలూపాడు అశోక్‌రావు.

☆☆☆

అలా వర్ధనమ్మ వెంట వెళ్ళిన సంధ్య - పిల్లలు, వారం రోజుల తర్వాత చాలా లగేజీతో తిరిగొచ్చారు. సంధ్య వస్తూ తెచ్చిన రెండు మామిడి పళ్ళ బుట్టలు, రెండు జాడీలనిండా మామిడి పచ్చడీ, పిల్లలకీ తనకూ పెట్టిన కొత్త బట్టలు చూసి విస్మయం ప్రకటించాడు అశోక్‌రావు.

అతనాభావం నుంచి తేరుకోక మునుపే ... ''ఇవన్నీ మా పుట్టింటి నుంచి తెచ్చాననుకుంటున్నారా ఏమిటి! మీ పిన్నిగారింటి నుంచీ నేరుగా ఇటే వచ్చేశాను. వర్ధని అత్తయ్య గారు పెట్టి పంపారు ఇవి'' అంటూ వివరించింది సంధ్య.

''బాప్‌రే! చాలా ఖర్చు అయివుంటుందే!'' ప్రతీదీ వ్యాపార దృక్పథంతో చూసే అశోక్‌రావు తన పిన్ని ఉదారతకు ఆశ్చర్య పోయాడు.

'తన వలన ఒరిగిందీ, ఒనగూడేదీ ఏమీ లేకపోయినా పిన్ని ఎందుకింత ఖర్చు పెట్టి వుంటుంది..' అని ఆలోచించసాగాడు.

''వాళ్ళు చాలా మంచి వారండి ... ఎంత మర్యాద చేశారనీ! ... వాళ్ళంతా కనబర్చిన ఆదరాభిమానాలకు నేను తట్టుకోలేక పోయానండి. చాలా సిగ్గుగా అన్పించింది నాకు. వాళ్ళు మన ఇంటిలో వున్న ఆ నాలుగు రోజులు మనం వాళ్ళకు సరైన తిండి పెట్ట లేకపోయాం... ప్రతి రూపాయికీ తడుముకున్నాం ... మనం చాలా పొరపాటు చేశామేమో అన్పించిందండీ...'' ఓ ఉపోద్ఘాతంలా ఉన్న సంధ్య మాటలు అశోక్‌రావుకు చిత్రంగా అన్పించాయి.



తనేం చెప్పినా ఎప్పుడూ డూడూ బసవన్నలా తలవూపే సంధ్య ఇన్నాళ్ళ తర్వాత ... సొంతగా స్వతంత్రంగా మాట్లాడటం చూసి షాక్ అయ్యాడు. 'సంధ్యని పిన్నితో ఊరికి పంపించి పొర పాటు చేయలేదుకదా!..' ఆలోచనలో పడ్డాడు.

''తరచూ వస్తూ పోతుండడమ్మా! మన బంధాలు, బంధుత్వాలు పది కాలాలు నిలుస్తాయి.... మంచీ చెడు తెలుస్తుంటాయి ... ఉన్న నాలుగు రోజులేగా! .. దేనికైనా ... గిరిగీసుకుని అలా ఒంటరిగా ... ఒంటరి అంకెలా బ్రతకటం ఏమిటమ్మా! .. అలా ఏం సాధిద్దామని?'' అనడుగుతూ అత్తయ్య గారు ఎంత బాధ పడ్డారని!

''మీరు చెప్పండి ... మీకెలా అన్పిస్తుంది! ... అత్తయ్య గారన్నది వాస్తవమేననిపించటం లేదూ!?''

తన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగిన సంధ్యకు సమాధానం ఇవ్వటానికి అప్పటికి తాత్కాలికంగా అతనిలోని 'ఇగో' అడుపడ్డా తర్వాత ఆలోచించాడు - తనను తానోసారి పునఃపరిశీలించుకున్నాడు ... ఇప్పుడు ... అన్పిస్తోంది ... తప్పకుండా తనేవిటో!? ...

(●)

## 'మస్' ఎందుకు ఫట్‌మంది?

'మస్త్'లో పాటలెక్కువ.
కొస్త స్క్రిప్ట్ ఓరియెంటెడ్‌గా ఉంటే బావుండేది.
అంటే రాంగోపాల్ వర్మకి కాన్ఫిడెన్స్ లేదా? అంటే ఉంది. అయినా అతనేం దేవుడు కాదుగా! అంతిమ నిర్ణయం ప్రేక్షకులది– అంటున్నాడు ఆ సినిమా హీరో అఫ్తాబ్.

